క్లుప్తంగా

గోవధ నిషేధంపై అవగాహన ర్యాలీ


ఆకివీడులో అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న పశువైద్యులు, సిబ్బంది

ఆకివీడు: గోవధ చట్టరీత్యానేరమని సహాయ పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.జనార్ధనరావు చెప్పారు. స్థానిక పశువైద్య కేంద్రం నుంచి శనివారం గోవధ నిషేధంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన చట్టం ప్రకారం గోవుల్ని చంపడం నేరమన్నారు. గోవధకు పాల్పడినా, సహకరించినా వారికి 1962 చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ర్యాలీలో మండల పశువైద్యాధికారిణి డాక్టర్ కెల్లా భార్గవీ సత్య, పశువైద్య సిబ్బంది కె.యోహాన్ పాల్గొన్నారు.

గోవధ చట్టరీత్యా నేరం

భీమవరం అర్బన్: గోవధ చట్టరీత్యా నేరమని, బక్రీద్ పండుగ సందర్భంగా గోవధ చేస్తే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని మండల పశు వైద్య అధికారి పి.పుండరీబాబు హెచ్చరించారు. భీమవరం మండలంలోని గూట్లపాడు గ్రామంలో శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే గోవధలపై గ్రామాలలో అవగాహన ర్యాలీలు నిర్వహించామన్నారు. ప్రజల్లో అవగాహన కోసం గ్రామాల్లో బ్యానర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

భవిత కేంద్రానికి ఆర్థిక సాయం


పోడూరులో భవిత కేంద్రానికి ఆర్థిక సాయం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగి నెక్కంటి అచ్చియ్య

పోడూరు: పోడూరులోని భవిత కేంద్రానికి గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి నెక్కంటి అచ్చియ్య రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. భవిత కేంద్రం ఉపాధ్యాయులకు శనివారం ఆయన ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అచ్చియ్య మాట్లాడుతూ దివ్యాంగులైన చిన్నారుల విద్యాభోధనకు, వైకల్యానికి చికిత్స అందించడంలోనూ భవిత కేంద్రాలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. భవిత కేంద్రంలో విద్యార్థులైన చిన్నారుల కోసం తాను ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. హెచ్ఎం రామకృష్ణ, ఉగ్గిరాల చంటి, కోలా విజయ్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం


క్యాన్సర్ రోగికి ఆర్థిక సహాయం అందజేస్తున్న మానవత సభ్యులు

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని బ్రాడీపేటకు చెందిన జి.సుబ్రహ్మణ్యం గత కొంతకాలం నుంచి క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పోషణ భారంగా సాగుతోంది. విషయాన్ని తెలుసుకున్న పాలకొల్లు మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శనివారం రోగికి రూ.15వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ బాధితుడి సుబ్రహ్మణ్యానికి మెరుగైన వైద్యం అందించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. సంస్థ సభ్యుడు సిద్ధాని సందీప్ రూ.5వేలు, సంస్థ సభ్యులు ఇచ్చిన మొత్తాన్ని కలుపుకుని రూ.15 వేలు సహాయం చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధాని బాల శంకర మల్లేశ్వరరావు, బొక్కా గంగాధరరావు, బోళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'అంగన్‌వాడీ పిలుస్తోంది'

- అంగన్‌వాడీ కేంద్రాల్లో పూర్వ ప్రాథమిక విద్యపై తల్లులకు అవగాహన
- విద్య పూర్తి చేసుకున్న పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి సర్టిఫికెట్ల అందజేత


పెద అమిరంలో గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో చిన్నారులు

పాలకోడేరు: పిల్లల్లో శారీరక, మానసిక అభివృద్ధి జరగాలంటే కచ్చితంగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.పార్వతి అన్నారు. శనివారం పాలకోడేరు మండలం పెన్నాడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలలో 'మన అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాలలో అందించే పూర్వ ప్రాథమిక విద్యపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్య పూర్తి చేసుకున్న ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎ.పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మావతి, విజయలక్ష్మి, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు పోషకాహారం అవసరం

వీరవాసరం: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రాయకుదురు సెక్టార్ పెర్కిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వి.కనకమహాలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషకాహారం అందించడంతో పాటు బాల్యం నుంచి చక్కని నడవడిక, క్రమశిక్షణ అలవడతాయన్నారు. ఈ నెల 15 తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడంతో పాటు అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకున్న చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి పట్టాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ జి.వరలక్ష్మి, ఆయా లక్ష్మీపార్వతి, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రాడ్యుయేషన్ డే

కాళ్ల: ఆకివీడు ప్రాజెక్ట్ పరిధిలో కాళ్ల సెక్టార్, పెద అమిరం గ్రామంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. మూడేళ్ల వయస్సు దాటిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని, పౌష్టికాహారం, తదితర అంశాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించామని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సూర్యకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్, సిబ్బంది పాల్గొన్నారు.


పెన్నాడలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది


రాయకుదురు అంగన్‌వాడీ కేంద్రంలో సర్టిఫికెట్లతో చిన్నారులు


పెన్నాడలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ జి.పార్వతి

నేడు పురుష సమాజ ఆదివారం

ఉండి: అంతర్జాతీయ ఫాదర్స్‌డే వేడుకను పురస్కరించుకుని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం ట్రినిటీ లూథరన్ చర్చిలో పురుష సమాజ ఆదివారం, ఫాదర్స్‌డే వేడుకలను ఆదివారం నిర్వహిస్తున్నట్లు పురుష సమాజ ప్రతినిధులు శనివారం తెలిపారు. ఈ వేడుకల్లో వందలాది మంది పురుషులు వారి కుటుంబాలతో చర్చిలో నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ వేడుకలో రెవ.ఎం.జోసెఫ్ (చేబ్రోలు) ప్రసంగిస్తారని వారు తెలిపారు. ఆసక్తి కలవారు ఈ వేడుకల్లో పాల్గొని దేవుని దీవెనలు పొందాలని వారు కోరారు.

స్పీడు బ్రేకర్లు వేయాలి

నరసాపురం: పట్టణంలోని స్టీమర్ రోడ్డు జంక్షన్ వైఎస్సార్ సెంటర్ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు వేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు లేకపోవడంతో ప్రతి రోజూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అల్లూరి సత్యనారాయణరాజు మునిసిపల్ కాంప్లెక్స్‌కు ఎదురుగా ఉన్న ఈ ప్రాంతం పట్టణంలో ప్రధాన సెంటర్. పట్టణంలో మొత్తం వ్యాపారమంతా దాదాపు ఇదే ప్రాంతంలో జరుగుతుంది. కూరగాయల మార్కెట్, చేపలు, కిరాణా మార్కెట్‌కు ఈ ప్రాంతం గుండానే వెళ్లాలి. ఈ ప్రాంతంలో స్పీడు బ్రేకర్లు నిర్మించే పరిస్థితి కాస్త మెరుగవుతుందని పట్టణవాసులు కోరుతున్నారు.

కొబ్బరికాయల దొంగతనంపై కేసు నమోదు

యలమంచిలి: కాజ పడమర గ్రామానికి చెందిన గుబ్బల నెహ్రూ కొబ్బరికాయల వ్యాపారం చేస్తుంటారు. అతనికి కాజ బైపాస్ రోడ్డులో దుకాణం ఉంది. అక్కడ కొబ్బరి రాసిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు సుమారు రెండు వేల కొబ్బరికాయలు దొంగతనం చేశారు. ఈ మేరకు నెహ్రూ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ వివరించారు.

నేడు ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

పెనుగొండ: ఆచంట మండల పరిషత్ సమావేశం మండల పరిషత్ అధ్యక్షులు దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి.నరసింహ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో మండలంలో చేపట్టే పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చిస్తారని పేర్కొన్నారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఇతర ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మావుళ్లమ్మ సేవలో ఎంపీ అప్పలనాయుడు


విజయనగరం ఎంపీ అప్పలనాయుడును సత్కరించి జ్ఞాపిక అందజేస్తున్న ఏసీ నగేష్


ఎంపి అప్పలనాయుడును దుశ్శాలువాలతో సత్కరిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్ళమ్మ అమ్మవారిని విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ ఆయనను దుశ్శాలువాతో సత్కరించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. ఆలయ ఉపప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు పాల్గొన్నారు.

అంజిబాబును కలిసిన ఎంపీ అప్పలనాయుడు

భీమవరం: విజయనగరం పార్లమెంట్ సభ్యుడు కలిశెట్టి అప్పలనాయుడు భీమవరం ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు)ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం భీమవరం వచ్చిన అప్పలనాయుడు శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న తరువాత ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంజిబాబును కలిశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడును ఎమ్మెల్యే దుశ్శాలువాతో సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ చైతన్యరాజు ఉన్నారు.

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా శ్రీశ్రీ


భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: శ్రమజీవుల అభ్యున్నతి కోసం, అసమానతలు, దోపిడీ లేని వ్యవస్థ కోసం తుదిశ్వాస వరకు పరితపించిన విప్లవ కవి శ్రీశ్రీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. శ్రీశ్రీ 41వ వర్ధంతిని భీమవరంలో శనివారం సీపీఐ అధ్వర్యంలో నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. శ్రీశ్రీ సినీ, విప్లవ, అభ్యుదయ రచయితగా, కవిగా ఉన్నత స్థానంలో నిలిచారని కొనియాడారు. పండితులకు, సంపన్నులకే పరిమితమైన సాహిత్యాన్ని అతి సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో సరళ భాషతో చేరువచేసిన శ్రీశ్రీ మరణించి నాలుగు దశాబ్దాలు దాటినా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం పొందారన్నారు. ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.జమలయ్య మాట్లాడుతూ విప్లవ కవి శ్రీశ్రీ చిరస్మరణీయుడని సమ సమాజం కోసం వివక్షత లేని సమాజం కోసం, సోషలిస్టు రాజ్యం కోసం పరితపించారని కొనియాడారు. ప్రజా సమస్యలను తన రచనల ద్వారా జనబాహుళ్యంలోకి తీసుకెళ్లి చైతన్యం తెచ్చారన్నారు. తొలుత శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారామ్ ప్రసాద్, కళింగ లక్ష్మణరావు, వైవీ ఆనంద్, తిరుమాని కామేశ్వరరావు, చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల సేవలు భేష్


మాట్లాడుతున్న సీఐ వై.సత్యకిషోర్, చిత్రంలో ఎస్సై నాళం శ్రీనివాసరావు

పాలకోడేరు: ఎన్నికల నిర్వహణలో, శాంతి భద్రతలను కాపాడటంలో ఎంతో కృషి చేశారని భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ మహిళా పోలీసులకు కితాబిచ్చారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన మహిళా పోలీసుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇదేవిధంగా ఇకపై కూడా గ్రామాల్లో ఫ్లెక్సీలు తదితర లాంటి ధ్వంసం, గొడవలు, బెట్టింగులు, జూదం, కోతాట, కోడి పందేలు లాంటి అసాంఘిక కార్యకలాపాలు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు, మహిళా సంరక్షణ కార్యదర్శులు పూర్ణిమ లలిత, కోనాల బేబీ, రేఖ, బొక్కా నాగలక్ష్మి, అనూష, కృష్ణవేణి, విజయలక్ష్మి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు మంత్రిత్వ శాఖ ఏర్పాటుకు వినతి



తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేస్తున్న బొబ్బిలి బంగారయ్య, అడవి సుబ్బారావు

ఆకివీడు: సమాజంలోని జనాభాలో వృద్ధులు అధికంగా ఉన్నందున వారికి ప్రభుత్వంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరుతూ సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం నాయకులు శనివారం తహసీల్దార్ వెంకటేశ్వరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య, కార్యదర్శి అడవి సుబ్బారావు మాట్లాడుతూ వృద్ధుల పింఛన్‌ను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు చేయడం హర్షదాయకమన్నారు. కరెంట్ అధికంగా వినియోగించారని తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు. వృద్ధుల చట్ట ప్రకారం జిల్లాలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేయాలని, వృద్ధులపై వేధింపులు, సాధింపులతో ట్రిబ్యునల్‌కు వెళ్ళిన వారికి న్యాయం జరగడంలేదని, తీర్పుల అమలుజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రతి పోలీస్ స్టేషన్‌లో వృద్ధమిత్ర ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. వృద్ధుల సమస్యలపై ఇచ్చిన వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తహసీల్దార్ వెంకటేశ్వరి చెప్పారు.

అనధికార కట్టడానికి జరిమానా

నరసాపురం: నరసాపురం పట్టణంలో 17వవార్డు పెమ్మినీడి వారివీధిలో అజ్జరపు సీతారామాంజనేయమూర్తి మున్సిపల్ అనుమతులు లేకుండా భవన నిర్మాణం చేశారని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. దీనిపై 2021లో టౌన్‌ప్లానింగ్ కోర్టును ఆశ్రయించిందని వివరించారు. నరసాపురం అడిషనల్ సివిల్‌జడ్జి కోర్టు అక్రమ నిర్మాణం చేసిన సీతారామాంజనేయమూర్తికి రూ1,78,903లు ఫైన్ విధించిందని చెప్పారు. పట్టణంలో అక్రమ నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని, పట్టణ వాసులు గమనించాలని చెప్పారు.

వేగంగా పంట బోదెల తవ్వకం పనులు


కేపీ పాలెం సౌత్‌లో పంటబోదె తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో పంటబోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. కాలువలు వదలడంతో ప్రతి శివారు ప్రాంతానికి సాగు నీరందాలనే ఉద్దేశంతో పంట బోదె తవ్వకం పనులు చేపట్టారు. మండలంలోని కెపిపాలెం సౌత్, నార్త్, మొగల్తూరు పంచాయతీలోని పాలకమ్మచెరువు, నక్కావారిపాలెం, పడమటిపాలెం తదతర ప్రాంతాలలో గత రెండు రోజులుగా పంటబోదె తవ్వకం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దాళ్వా సాగుకు సంబంధించి ప్రతి ఎకరాకు సాగు నీరందంచినట్లుగానే సార్వా సాగుకు ప్రతి శివారు భూములకు నీరందించేందుకు పంటబోదెల తవ్వకం చేపట్టామని టీఏ వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

అధ్వానంగా మొగల్తూరు ప్రధాన కాలువ


మొగల్తూరు ప్రధాన కాలువలో పేరుకుపోయిన గుర్రపు డెక్క, చెత్త

మొగల్తూరు: మొగల్తూరు ప్రధాన కాలువ అధ్వానంగా తయారైంది. నిడదవోలు- నరసాపురం ప్రధాన కాలువ మొగల్తూరు వరకు ప్రవహిస్తుంది. ఎగువ ప్రాంతం నుంచి వచ్చే జంతుకలేబరాలు, చెత్త చెదారాలు అన్నీ మొగల్తూరు వరకు వచ్చి నిలిచిపోతాయి. ముఖ్యంగా నరసాపురం మండలం సీతారాంపురం నుంచి మొగల్తూరు లాకు వరకు పెద్ద ఎత్తున గుర్రపుడెక్క నిలిచిపోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగదు. ప్రధానంగా ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన నిలిచిపోవడంతో తీవ్ర దుర్వాసన వస్తుందని స్థానికులు వాపోతున్నారు. మొగల్తూరు ప్రధాన కాలువలోని నీరు వేలాది ఎకరాలకు సాగు నీరు అందించడంతో పాటు సుమారు 8 గ్రామాల ప్రజలకు తాగునీటి అవసరాలు తీరుస్తుంది. మొగల్తూరు కాలువ నీటిని కేపీ పాలెంలో భారీ మంచి నీటి చెరువును, మొగల్తూరులోని మంచి నీటి చెరువును నింపుతారు. అయితే కాలువ నీరు అధ్వానంగా ఉండటంతో పాటు దుర్వాసన వస్తుండటంతో తాగు నీటి చెరువులను నింపడంలేదు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి కాలువలో నిలిచిపోయిన గుర్రపుడెక్క, చెత్తచెదారాలను తీసేసి ప్రక్షాళన చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

మొగల్తూరు: స్థానిక కేతకీపుర సామ్రాజ్య శ్రీ భూసమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే స్వామి వారిని పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు కురెళ్ళ రామచంద్రుడు ఆధ్వర్యంలో భక్తులుస్వామి వారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి



గోవధ చేస్తే కఠిన చర్యలు


నరసాపురంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు

నరసాపురం: గోవధ నిషేధ చట్టాన్ని అనుసరించి గోవధ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆయన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. గోవధ చేసే వారిపై, గోవధ నిమిత్తం గోవులను తరలించే అంశాలపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. యానిమల్ బోర్డు ఆఫ్ ఇండియా నిబంధనల ప్రకారం గోవధను అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. సోమవారం బక్రీద్ రోజు గోవధలు జరగకుండా పట్టణమంతా నిఘా పెట్టాలని శానిటరీ అధికారులను ఆదేశించారు. గోవధ చేసినా, రవాణా చేసినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రాంతీయ పశుసంవర్థక ఏడీ డాక్టర్ వై.సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.ప్రభాకర్ పాల్గొన్నారు.

పోడూరులో..

పోడూరు: బక్రీద్ పండుగ నేపథ్యంలో ఎవరైనా గోవులను వధిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు ఉంటాయని స్థానిక వెటర్నరీ ఏడీ డాక్టర్ జాన్సన్ హెచ్చరించారు. గోవధ నిషేధంపై శనివారం పోడూరులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో వైద్యులు, సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ జాన్సన్ మాట్లాడుతూ గోవధ చట్టరీత్యా నేరమనీ, గోవధకు పాల్పడిన వారిపై, సహకరించినవారిపై కూడా 1962 చట్టం ప్రకారం చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.